

హంతకులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట

నెల్లూరు జిల్లాలోని కల్లూరుపల్లి ఆర్‌డిటి కాలనీలో గంజాయి మాఫియా ఆగడాలు అరికట్టడానికి కృషిచేసిన డివైఎఫ్ఐ నేత, ప్రజానాట్యమండలి స్థానిక కార్యదర్శి కే.పెంచలయ్యను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్, పందికాళ్ళ మణి డిమాండ్ చేశారు. మంగళవారం రాజంపేటలో వారు మాట్లాడుతూ ఉద్యమకారుడి హత్య దారుణమని, హంతకులకు విధించే శిక్ష గంజాయి స్మగ్లర్లకు గుణపాఠం కావాలని అన్నారు.

జాబ్‌మేళాతో నిరుద్యోగులకు ఉపాధి

- పోస్టర్ల ఆవిష్కరణలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఈనెల 3న రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహింపతలపెట్టిన మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర యువజన, క్రీడ శాఖల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో మంత్రి మెప్మా అధికారులతో కలిసి మెగాజాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాలైన రాయచోటి, మదనపల్లి, రాజంపేట, మున్సిపాలిటీలలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మెప్మా అధికారులు జాబ్ మేళాను నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం మొదటిసారిగా పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఒక కుటుంబం నుంచి ఒక పారిశ్రామిక వేత్త అనే లక్ష్యంతో మెప్మా ఆధ్వర్యంలో మెగా జాబ్ నిర్వహణకు రంగం సిద్ధం చేసిందన్నారు. విప్రో, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇండియా పేటీఎం, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్, రిలయన్స్ మెడ్ ప్లస్ లాంటి15 కంపెనీలతో పట్టణంలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు తప్పక జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. మెప్మా పీడీ లక్ష్మీదేవి మాట్లాడుతూ టెన్త్ ఇంటర్ డిగ్రీ, డిప్లమో బిటెక్ , పీజీ, ఫార్మా నర్సింగ్ కోర్సులను పూర్తి చేసుకున్న వారు జాబ్ మేళాకు హాజరు కావచ్చునున్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాకు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు వెంటనే నియమాక పత్రాలు అంద చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధికారి అబ్బాస్ అలీ ఖాన్, మెప్మా సిబ్బంది మంత్రి సోదరుడు మండిపల్లె లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, గాజుల ఖాదర్ బాషా, విష్ణువర్ధన్ రెడ్డి, మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం కృషి

రాయచోటి : నిత్యం ప్రజల మధ్య ఉండే కార్యకర్తలు, అభిమానులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలోని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు మంత్రి హామీనిచ్చారు. **జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తాం..** సిఎం చంద్రబాబు జిల్లా కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి అభివృద్ధి గురించి జిల్లా అధికారులు , మున్సిపల్ అధికారులు రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం రాయచోటిలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీనివాసులు, అన్ని మండలాల తహశీల్దార్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తాం

కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి - రాయచోటి

వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి, లాభసాటిగా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ అధి కారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ప్రైమరీ సెక్టార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, సిరి కల్చర్ అధికారి, ఎపిఎంఐపి పీడీ, పశుసంవర్ధకశాఖ, మత్స్య శాఖ, సహకార శాఖ, మార్కెటింగ్, డిఆర్‌డిఎ, మార్క్‌ఫెడ్ డిఎం, ప్రైమరీ సెక్టార్ల అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, విలేజ్ అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లలతో జెసితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 271 రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 3న నిర్వహించే రైతన్న మీకోసం కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది పాల్గొని రబీ, ఖరీఫ్ పంటల యాక్షన్ ప్లాన్, వివిధ రకాల అంశాలపై రైతులతో సలహాలు సూచనలు తీసుకొని విజయవంతం చేయాలని కలెక్టర్ అన్నారు. రైతుల ఆదా యం పెంపు లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, సాంకేతిక పద్ధతులు, ఆధునిక సాగు విధానాలు గ్రామ గ్రామానికీ చేరేలా అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఇంటర్‌క్రాప్ సాగు, వివిధ పంటల సాగు, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రోత్సాహం ప్రకృతి వ్యవసాయం, ఖర్చుల తగ్గింపు, లాభాల పెంపు వంటి అంశాలపై రైతులతో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో రైతుల జిడిపి పెంపు ప్రధాన లక్ష్యంగా తీసుకొని మండల స్థాయి, జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలను సంబంధిత అధికారులు రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రతి మండలంలోని రైతు సేవ కేంద్రంలో ప్రత్యేక అవగాహన వర్క్ షాప్ నిర్వహించాలని, కార్యక్రమాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, గ్రామ రైతులు ముఖ్యంగా ప్రకృతి వ్యవసాయం చేపడుతున్న రైతులు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందాలని పిలుపునిచ్చారు. రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా ఖర్చులు తగ్గించి, ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలపై లోతుగా చర్చించి నివేదికలను తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి రైతు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారా వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, రైతుల ఆదాయ పెంపు లక్ష్యాన్ని సాధించేందుకు అన్ని శాఖలు కృషి చేయాలని సూచించారు. అలాగే డిఆర్‌డిఎ, ఎపిఎంలు, పశు సంవర్ధక శాఖ అధికారులు సమన్వయం చేసుకొని గ్రామ స్థాయిలో ఆవులు, గేదెలు ఎవరికి కావాలో వారి నుండి దరఖాస్తులను స్వీకరించి బ్యాంకుల ద్వారా రుణాలను అందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని, జిల్లాలో పాల ఉత్పతిని పెంచే దిశగా పని చేయాలని ఆదేశించారు. ఎపిఎంఐపి, మత్స్య శాఖ తదితర అధికారులు వారికీ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జి. శివనారాయణ, ఉద్యానశాఖ , సిరి కల్చర్, ఎపిఎంఐపి, పశుసంవర్ధక, మత్స్య, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలకు దరఖాస్తు అవకాశం కల్పించాలి

-సబ్ కలెక్టర్‌కు మాజీ సైనికుల వినతి



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ సైనికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ సైనికులకు ఇంటి స్థలం, రూ.5లక్షల ఆర్థిక సహాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే సదుపాయం కల్పించాలని మదనపల్లి డివిజన్ మాజీ సైనికులు సంఘం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసులు నాయుడు పేర్కొన్నారు.మంగళవారం మదనపల్లి సబ్ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులకు 5 సెంట్లు ఇంటి స్థలం, రూ. 5లక్షల ఆర్థిక సాయం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొను సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలము, గృహ నిర్మాణం కొరకు ఆర్థిక సహాయం కల్పిస్తున్నారని,గ్రామ, వార్డు సచివాలయాల్లో మాజీ సైనికులు దరఖాస్తు చేసుకోవడానికి సదుపాయం లేదన్నారు. దేశం కోసం ఎన్నో యుద్ధాలలో, ఆపరేషన్లలో పోరాడి ఉద్యోగ విరమణ పొందామని గుర్తు చేశారు. మాజి సైనికులకు జిఒ ప్రకారం ఐదు ఎకరాల మెట్ట లేక 2.5 ఎకరాల మాగాణి, 2 కుంటల ఇంటి స్థలం కేటాయించాలని ఉన్నా, అది కాగితాలకే పరిమితమైందన్నారు.మాజీ సైనికులకు దరఖాస్తు చేసుకొనుటకు ప్రత్యేక ఆప్షన్ ఏర్పాట్లు చేయాలన్నారు. త్రిసభ్య కమిటిలో ఉన్న మంత్రులు నారా లోకేష్, నారాయణ, పయ్యావుల కేశవ్ మాజీ సైనికులకు ప్రత్యేక ఏర్పాటుకు సిఫారసు చేయాలని కోరారు. కార్గిల్, సింధూర్ ఆపరేషన్లలో చాలా మంది సైనికులు పోరాడి వీరమరణం పొంది భారత దేశ విజయానికి తోడ్పడ్డారన్నారు. యుద్ధాలలో వారి కుటుంబ సభ్యులకు మాత్రమే కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించి సైనికుల అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించి ఆ కుటుంబానికి మాత్రమే బాసటగా ఉంటున్నారు. ప్రతి ఏడాది స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సం రోజున మాత్రమే సైనికుల సేవలను కొనియాడి విస్మరించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సైనికులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం : ఎస్‌పి



పోలీస్ యూనిట్ వెల్ఫేర్ ఆస్పత్రిని ప్రారంభిస్తున్నఎస్‌పి ధీరజ్ కునుబిల్లి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పోలీస్ సిబ్బందికి, వారి కుటుంబాలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే ముఖ్య లక్ష్యమని ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి అన్నారు. మంగళవారం పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీస్ యూనిట్ వెల్ఫేర్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమమే జిల్లా పోలీస్ శాఖకు ప్రథమ బాధ్యత అని అన్నారు. యూనిట్ వెల్ఫేర్ ఆసుపత్రిలో పోలీస్ సిబ్బందికి వారి కుటుంబాలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందిస్తారని చెప్పారు. ఈ యూనిట్ వెల్ఫేర్ ఆసుపత్రి కేవలం భవనం మాత్రమే కాదని పోలీస్ శాఖ తీసుకున్న మొదటి ఆరోగ్య భరోసా అన్నారు. ఇందులో అన్ని రకాల ప్రాథమిక వైద్య సదుపాయాలు, అవసరమైన మందులు ఉచితంగా అందుబాటులో ఉంటాయని తరచుగా ఒత్తిడికి గురయ్యే సిబ్బందికి భవిష్యత్తులో మానసిక ఆరోగ్య సేవలు కూడా అందించేందుకు ప్రణాళికలు రూపొం దిస్తున్నామని చెప్పారు. ప్రతి మంగళవారం జనరల్ డాక్టర్ అందుబాటులో ఉండి సాధారణ వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం స్పెషలిస్ట్ డాక్టర్ అందుబాటులో ఉండి ప్రత్యేక చికిత్సలు అందిస్తారని, పోలీసు వారి కుటుంబ సభ్యులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఏర్పాటుకు సహకరించిన డిఎంహెచ్ఒ, రాయచోటి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్ర మంలో ఎఎస్‌పి ఎం వెంకటాద్రి, రాయచోటి ఏరియా ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, వైద్యులు రామరాజు, రాధిక, అబ్దుల్ లతీఫ్, త్రినాధ సత్యం, సిఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు, హోంగార్డు, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ఎంపిడిఒకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించి, కురవంక పంచాయతీకి సెక్రటరీని నియమించాలని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద కురవంక వార్డు మెంబర్లతో కలిసి పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ తాజ్‌మాస్రూర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు కృష్ణమూర్తి, నాగరాజు మాట్లాడుతూ కురవంక గ్రామపంచాయతీలో 12 వార్డుల్లో పారిశుధ్య కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. వీరితోపాటు వీధిలైట్లు, బిల్ కలెక్టర్, వాటర్ మ్యానుతో కలిపి ఇద్దరు ఆటో డ్రైవర్లు పనిచేస్తున్నారన్నారు. గత మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయంగా గ్రామ సర్పంచ్‌ను వివరణ కోరితే పారిశుధ్య కార్మికులకు జీతాలు పెట్టే బాధ్యత సెక్రటరీదేనన్నారు. ఇక్కడ గతంలో పనిచేసిన సెక్రటరీ సస్పెండ్ కావడంతో కురవంక పంచాయతీలో సెక్రటరీ లేక వేతనాలు అందడం లేదన్నారు. ఎంతో అభివృద్ధి సాధిస్తున్న కురవంక పంచాయతీకి సెక్రటరీని నియమించకుండా ఎంపిడిఒ సాకులు చెబుతున్నారని, ఇది సమంజసం కాదన్నారు. వెంటనే కురవంక పంచాయతీకి సెక్రటరీ నియమించి పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందేవిధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు నారాయణమ్మ, రవణమ్మ, రాధాకృష్ణ, రెడ్డెమ్మ, అంజి, సురేష్, చంద్రకళ, లక్ష్మీదేవి, సరోజమ్మ, కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం సాధనకు నడుం బిగించాలి

ప్రజాశక్తి-రాజంపేట

జిల్లా కేంద్రంగా అన్ని అర్హతలు కలిగిన రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటించేవరకు పోరాడేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జనసేన నేత యల్లటూరు శివరామరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాజంపేట జిల్లా కేంద్ర సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సబ్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు. రోడ్డు, రైల్వే, విమాన సౌకర్యాలు కలిగి మరియు రాజంపేటకు అతి సమీపంలో అన్నమయ్య నడయాడిన తాళ్లపాక గ్రామం ఉందన్నారు. సువిశాలమైన సబ్ కలెక్టర్ కార్యాలయంతో పాటు పార్లమెంటు కేంద్రంగా ఉన్నటువంటి రాజంపేటను గతంలో పాలకులు వారి స్వార్థం కోసం అశాస్త్రీయంగా వేరే ప్రాంతాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని అన్ని అర్హతలు కలిగినటువంటి రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా ప్రకటిస్తారని ఆకాంక్షిస్తూ... బుధవారం జరగబోవు కార్యక్రమానికి నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కూటమినేతలు, కార్యకర్తలు, విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారులు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రతి ఒక్కరూ మనందరి బాధ్యతగా తీసుకొని ఈ కార్యక్ర`మాన్ని విజయవంతం చేసి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు మన విజ్ఞప్తులు వినిపించాలని తెలిపారు. కార్యక్ర మంలో కూటమినేతలు షబ్బీర్ అహ్మద్, సమ్మెట శివప్రసాద్, మౌలా, శంకర్ రాజు, చింతల శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివరామరాజు

గ్రామాలకు చేరిన జిల్లా కేంద్రం ఉద్యమం

జిల్లా కేంద్రం ఉద్యమం పట్టణం నుంచి పల్లెలకు కూడా పాకింది. పురుషులతోపాటు మహిళలు సైతం స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉద్యమంలో పాల్గొంటున్నారు. మంగళవారం మండల పరిధిలోని వైబిఎన్ పల్లెలో టిడిపి మాజీ మండలాధ్యక్షులు వెంకటేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రజలు ప్లకార్డులు పట్టి రాష్ట్ర ప్రభుత్వం రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని నినాదాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో బహిరంగ సభలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటించిన చంద్రబాబు హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు లక్ష్మీనారాయణ, పూల భాస్కర్, ప్రభాకర్ నాయుడు, మేడికొండ రవికుమార్‌నాయుడు, సురేష్, మహదేవయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటులో ఎమ్మెల్యే కృషి ప్రశంసనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లక్షల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేస్తూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ 17 నెలల్లో మదనపల్లి జిల్లా కేంద్రంగా ప్రకటిస్తూ తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు, మదనపల్లి నియోజకవర్గాలను మదనపల్లి జిల్లా పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంలో కీలక పాత్ర పోషించిన మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషాను మదనపల్లి మెప్మా కార్యాలయంలో మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యేషాజహాన్ భాషా చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి, ఎమ్మెల్యే షాజహాన్ బాషాను శాలువతో సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మెప్మా సిబ్బంది మాట్లాడుతూ మదనపల్లి ప్రజల ఆకాంక్షల నెరవేరుస్తూ మదనపల్లి జిల్లా ఏర్పాటు చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఎంఎం మధుసూదన్‌రెడ్డి, సిఒలు భానుప్రకాష్, అనిత, నాగేంద్రప్రసాద్, మస్తాన్, జబీవుల్లా, తులసి, ఆర్‌పిలు జాఫరున్నిషా, నాగజ్యోతి, వసంత, పుష్ప, యశోద, లక్ష్మి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజా పోరాటాలతోనే జిల్లా సాకారం..** మదనపల్లి జిల్లా సాధన జెఎసి ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ ఆధ్వర్యంలో ఉద్యమకారుల విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ టిప్పు సుల్తాన్ గ్రౌండ్ నుంచి ప్రారంభమై స్థానిక ఆర్‌టిసి బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్ వరకు సాగింది. అంబేద్కర్ సర్కిల్ నందు నిర్వహించిన బహి రంగ సభలో వక్తలు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అదే రోడ్లపై అనేక పోరాటాలు, అనేక నిరసన కార్యక్రమాలు చేపట్టామని, నిర్బంధనలు, అరెస్టులకు కేసులకు భయపడలేదని తెలిపారు. బందెల గౌతమ్ కుమార్, యమలా సుదర్శనంలు మాట్లాడుతూ ప్రజా పోరాటాలను ప్రజాభిప్రాయాలను పెడచెవిన పెడితే ఎలాంటి గతి పడుతుందో వైసిపి రుచి చూసిందన్నారు. మదనపల్లి జిల్లా అభివృద్ధిలో ఎలాంటి వెనుకంజ లేకుండా చేయాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముత్యాల మోహన్, మాలమహానాడు నాయకులు గుండా మనోహర్, బిఎస్‌పి నాయకులు బాలాజీ, ఫణి, కార్యకర్తలు పాల్గొన్నారు.



బిఎస్‌పి ఆధ్వర్యంలో చేపట్టిన విజయోత్సవ ర్యాలీ

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

ఎసిఎ అండర్ - 14 ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్, సౌత్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య నిర్వహించిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్ లో సౌత్ జోన్ విన్నర్స్ జట్టు 76.0 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసి డిక్లేర్ ప్రకటిం చింది. ఆ జట్టులోని మొహమ్మద్ ఇజ్హార్ 91 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని నాగ వెంకట జత్విక్ నాలుగు, ఉనయిస్ మూడు వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 78.0 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 303 పరుగులు చేసింది. ఆ జట్టులోని రాజ్ 129 పరుగులు (సెంచరీ) చేశాడు. కెఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నార్త్ జోన్ విన్నర్స్, సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. మొదటి ఇన్నింగ్స్‌లో నార్త్ జోన్ విన్నర్స్ జట్టు 272 పరుగులు చేసింది. వికెట్ నష్టపోకుండా చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 90.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ సాయి 111 పరుగులు సెం చరీ చేసి నాటౌట్‌గా నిలిచాడు.

జాతీయస్థాయికి యువ క్రికెటర్ సాద్ ఇర్ఫాన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



గుంటూరులో గత నెల 29 నుండి ఈనెల 1వ తేదీ వరకు జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 అంతర్ జిల్లా క్రికెట్ పోటీల్లో ప్రొద్దుటూరు యువ క్రికెటర్ సాద్ ఇర్ఫాన్ మరోసారి ఔరా అనిపించాడు. ప్రొద్దుటూరులోని గౌతమ్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సాద్ ఇర్ఫాన్ వరుసగా రెండోసారి జాతీయ స్థాయిలో ఆడే అవకాశం సాధించడం గర్వ కారణం. ప్రతిభ చూపడంతో నేషనల్ టీమ్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు కూడా దక్కించుకున్నాడు. ఓపెనింగ్ బ్యాట్స్ మెన్‌గా దిగిన సాద్ టోర్నమెంట్‌లో 135 స్ట్రిక్ రేట్‌తో, 125 పరుగుల సగటుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. సాద్ ఆడిన ఎక్కువ మ్యాచ్‌ల్లో నాట్ అవుట్‌గా నిలిచి టీంను విజయం వైపు నడిపించాడు. బ్యాటింగ్‌తో పాటుగా బౌలింగ్‌లో కూడా సాద్ తన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు. 4 వికెట్లు తీసి, ఓవర్‌కు 3.8 ఎకానమీ రేట్‌తో ప్రత్యర్థుల స్కోరును అడ్డుకున్నాడు. సాద్ ఆడుతున్న టెక్నికల్ గేమ్‌ను రాహుల్ ద్రావిడ్, సంజయ్ మంజ్రేకర్ ఆటను గుర్తు చేస్తుందని కోచింగ్ స్టాఫ్, నిర్వాహకులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. బెస్ట్ బ్యాట్స్‌మన్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కూడా సాద్ అందుకున్నాడు. ప్రొద్దుటూరులోని బిఎస్ అకాడమీ కోచ్‌లు సయ్యద్ అహ్మద్, సయ్యద్ నస్రు పర్యవేక్షణలో రోజుకు 8 గంటల కఠిన శిక్షణ పొందుతున్నాడు. సాద్ ఇర్ఫాన్ తండ్రి ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా, తల్లి మోనా అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. వచ్చే ఎడాదిలో రాజస్థాన్‌లో జరుగనున్న నేషనల్స్‌లో కూడా సాద్ రాణిస్తే ఎస్‌జీఎఫ్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఆడే అవకాశం ఉంటుందని కోచ్‌లు తెలిపారు. సాద్ చెల్లెలు సారా ఇర్ఫాన్ కూడా ఇటీవల కాలంలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో జిల్లా స్థాయిలో 6 పతకాలు సాధించింది. స్టైలిష్ ప్లే స్టైల్, ఒత్తిడిలోనూ ఆత్మవిశ్వాసంతో కొనసాగించే తీరు, జట్టును ముందుండి నడిపే నాయకత్వ లక్షణాలు కలిగిన సాద్ ఇర్ఫాన్‌ను స్థానికులు ప్రొద్దుటూరు యువరత్నం, కడప వాల్‌గా ప్రశంసిస్తున్నారు. సాద్ ఇర్ఫాన్ భవిష్యత్ మరింత వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తున్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో 'బూన్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రస్థాయి స్కయ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో అండర్-11 విభాగంలో పట్టణంలోని బూన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థి డిఎల్.కుశల్‌సాయి సత్తా చాటాడు. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో నాలుగు బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి స్కయ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శంకర్, ప్రధానో పాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థి కుశల్ సాయి స్కయ్ మార్షల్ ఆర్ట్స్ పోటీలలో నాలుగు బంగారు పతకాలు కైవసం చేసుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఈ విద్యార్థి వచ్చే ఏడాది హైదరాబాద్ నగరంలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొం టారన్నారు. ఆ పోటీలలో ప్రతిభ కనబరిచిన కుశల్ సాయి పాఠశాల, మదన పల్లి పట్టణ కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. తమ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు క్రీడలలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. జాతీయ స్కయ్ మార్షల్ ఆర్ట్స్ పోటీలకు ఎంపికైన కుశల్ సాయికి పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.



మార్షల్ ఆర్ట్స్‌లో సత్తా చాటిన కుశల్‌సాయి



డిప్యూటీ ఎంపిడిఒకు సన్మానిస్తున్న స్థానికులు

డిప్యూటీ ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయానికి పదోన్నతి పొంది బదిలీపై వచ్చిన డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణిని మంగళవారం స్థానికులు పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. గతంలో చక్రపాణి మండల కేంద్రమైన కలకడ బాటవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో జూనియర్ అసిస్టెంట్‌గా 16 సంవత్సరాలు విధులు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఇర్ఫాన్ భాష, సయ్యద్ అలీ కలిసి ఘనంగా సన్మానించినట్లు తెలిపారు.

నడిమిచర్ల సచివాలయం తనిఖీ

నడమిచర్ల సచివాలయాన్ని డిప్యూటీ ఎంపిడిఒ చక్రపాణి తనిఖీలు నిర్వహించారు. గుడిబండ కోన నడిపించెర్ల పంచాయతీలను తనిఖీలు నిర్వహించారు. సచివాలయాలను పరిశీలించి రికార్డులు తని చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పరిశీలించి, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం చేపట్టే ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించి వాటి వలన ఉండే ఉపయోగాలు గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మహబూబ్‌బాషా,పంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

సిఐగా రామచంద్ర బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కలికిరి



బాధ్యతలు స్వీకరిస్తున్న రామచంద్ర

కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ నూతన సిఐగా కె.రామచంద్ర మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పి ధీరజ్ కునుబిల్లి ఉత్తర్వుల మేరకు రాయచోటి ఎస్‌బిఎస్ నుంచి బదిలీపై వచ్చిన ఆయన కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. నూతన సిఐ రామచంద్రకు పోలీస్ సిబ్బంది శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.అనిల్‌కుమార్ బదిలీపై వెళ్లారు. నూతన సిఐ రామచంద్ర మాట్లాడుతూ కలికిరి అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. మండలంలో ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలికిరి ప్రజలు రాజకీయ నాయకులు అందరు సహకారంతో కలికిరిలో శాంతిభద్రతలు కల్పించి మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.

గుండాల వంక వంతెన నిర్మాణానికి కృషి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని గుండాల వంతెనను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని మండల టిడిపి అధ్యక్షులు చెప్పిలి మహేష్‌నాయుడు పేర్కొన్నారు. గుండాల వంక తెగిపోయి అరళ్ల అవుతోందని, మండలంలోని పెద్దినేని కాలువగట్టు రాజుగారిపల్లి నుంచి సుండుపల్లికి రావడానికి ఇబ్బందులు పడు తున్నామని గ్రామస్తులు మహేష్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఆ అధికారులు, టిడిపి నాయకులతో కలిసి గుండాల వంకను పరిశీలించారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వంక వంతెన నిర్మాణం చేపడతానని గ్రామస్తులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి యూసుఫ్, కో-కన్వీనర్ మహేష్‌వర్మ, టిడిపి నాయకులు వెంకటేష్ నాయుడు, బాషా, నాగ సుబ్బయ్య, చంద్రశేఖర్‌రాజు, పాపరాజు, వెంకటరమణరాజు, సిద్దయ్య పరిశీలించారు.

తాత్కాలిక ఉపాధ్యాయుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - సంబేపల్లి

మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ఉపాధ్యాయులుగా పనిచేయుటకు మండల విద్యా వనరుల కేంద్రంలో ఈనెల 4 వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ డిఇఒ నాగయ్య, ఎంఇఒ అనంత కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జిటీగా, సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం(ఉర్దూ), జీవశాస్త్రం(ఉర్దూ) ఉపాధ్యాయులుగా పని చేయుటకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్జీటీలకు రూ.10వేలు, స్కూల్ అసిస్టెంట్లకు రూ.12,500జీతం సమగ్ర శిక్ష ద్వారా ఇస్తారని తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు మట్లి పెద్దూరు విద్యార్థులు

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలమనేరులో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14 బేస్ బాల్ విభాగము కడప జిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అందులో ప్రతిభ కనబరిచిన సి.జగదీష్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నవంబర్ 27 నుంచి 29వ తేదీ వరకు అహోబిలంలో జరిగిన అండర్ -17 బేస్ బాల్‌లో వి.హర్షవర్ధన్ (పదవ తరగతి) జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.జయన్న తెలిపారు. ఎంపికైన విద్యార్థులు జనవరిలో ఢిల్లీలో జరుగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 2025-2026 విద్యా సంవత్సరంలో మొత్తము ఐదుగురు విద్యార్థులు జాతీయస్థాయి సాఫ్ట్ బాల్, బేస్ బాల్‌కు ఎంపికైనట్లు వారు తెలిపారు. పాఠశాల నుంచి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడానికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన వ్యాయామ సంచాలకులు ఎ.జగదీశ్వరయ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాఠశాల కమిటీ చైర్మన్ నాగేశ్వర అభినందించారు.



జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైనవ విద్యార్థులతో ఉపాధ్యాయులు

రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవు

-సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి

ప్రజాశక్తి-కలికిరి

రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి రేషన్ డీలర్లను హెచ్చరించారు. మంగళవారం కలికిరిలోని రేషన్ ఎంఎల్ఎస్ కేంద్రాన్ని పరిశీలించారు. గోడౌన్‌లోని స్టాకును తనిఖీ చేసి రేషన్ డీలర్లకు సక్రమంగా తూకాలు వేసి ఇవ్వాలని, సరైన సమయంలో డీలర్లకు రేషన్ తరలించాలని డిటి నారాయణరెడ్డికి సూచించారు. అనంతరం పట్టణంలోని 6, 11, 8 ఎఫ్‌ఎ దుకాణాలను తనిఖీ చేశారు. రాగులు, బియ్యం, చక్కెర సక్రమంగా అందుతున్నాయా లేదా, సరైన ధరలకు ఇస్తున్నారా అని రేషన్ కార్డు దారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరికీ రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని, తూనికల్లో ఎలాంటి తేడాలు రాకుండా చూడాలని, రేషన్ పంపిణీలు సమయపాలన పాటించాలని వారికి సూచించారు. అనంతరం మండలంలోని మర్రికుంటపల్లి పంచాయతీలో జరుగుతున్న రీ సర్వేని పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వేను రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా చేసి వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ కల్యాణి

కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, డిటి సయ్యద్, సిఎస్ డిటి విజయ్ కుమార్‌రెడ్డి, గోడౌన్ డిటి నారాయణరెడ్డి, రీసర్వే డిటి చంద్రశేఖర్ రెడ్డి, సర్వేయర్ రెడ్డప్ప, విఆర్ఒ ప్రసాద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



వికలాంగుడికి ఆర్థికసాయం అందిస్తున్న ధ్వజారెడ్డి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండల పరిధిలో వైసిపి సీనియర్ నాయకులు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి తన సొంత నిధులతో అర్హత ఉండి పెన్షన్లు కోల్పోయిన అభాగ్యులకు నేనున్నానంటూ భరోసానిస్తూ పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తాడివాండ్లపల్లి, అరుంధతివాడకు చెందిన పెరాలసిస్‌తో మద్దూరి హరికి రూ.4వేలు, రైల్వే కోడూరు అరుంధతి వాడకు చెందిన కోడూరు వెంకటయ్యకు రూ.4వేలు అందించారు. న్యూ కృష్ణానగర్‌కు చెందిన బాబి కుమార్తె బీటెక్ చదువుతున్న నేపథ్యంలో ఆ విద్యార్థిని హాస్టల్ ఫీజు కొరకు ప్రతినెల రూ.5,500 అందిస్తున్నట్లు తెలిపారు. బిల్డింగ్ ఫీజు కొరకు రూ.9వేలు అందించారు. అనంతరం వెంకటేశ్వరపురం ఎస్‌టి కాలనీకి చెందిన అంజలి అనే వివాహిత పెరాలసిస్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని ఆమె వైద్య ఖర్చులు నిమిత్తం రూ.15వేలు అందించారు. శాంతినగర్ చెందిన ఖాద్రిన్‌బీ తన ఇంటి పోషణకు రూ.2వేలు, రాఘవ రాజాపురం చెందిన బండి పార్వతికి రూ.4వేలు అందజేశారు. ప్రజలకు అండగా ఉంటూ సాయం కోసం వచ్చే వారికి తన వంతు సహకారం అందిస్తున్నారని ప్రజలు కొనియాడారు. పెన్షన్లు పొందిన లబ్ధిదారులు మాట్లాడుతూ మా సమస్యలను గుర్తించి మా ఇబ్బందులను అర్థం చేసుకొని సొంతింటి పెద్ద కొడుకుగా అన్నగా మాకు ప్రతి నెల ప్రభుత్వం ఇవ్వకపోయినా రామిరెడ్డి ధ్వజారెడ్డి మాకు ప్రతి నెల ఒకటవ తేదిన తలుపు తట్టి పెన్షన్ల రూపంలో నగదును మాకు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కోడూరు వైసిపి పట్టణ అధ్యక్షులు రమేష్‌బాబు, సర్పంచ్ హరికృష్ణరెడ్డి, ఆర్‌వి రమణ, ఎంపిటిసి నూకా మహేశ్వర్ రెడ్డి, అనంతరాజుపేట సలాం తనయులు షఫీ, ట్రేడ్ యూనియన్ నాయకులు కొప్పల శంకరయ్య, వైయస్ కరీముల్లా, కృష్ణారెడ్డి, బత్తల సుబ్రహ్మణ్యం, శ్రీరాములు, కె.ప్రసాద్, సెట్టిగుంట షఫీ, మాజీ సర్పంచ్‌జహంగీర్, గౌతమ్‌రెడ్డి, రమణారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

'మిట్స్'లో విద్యా రుణాలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో స్కాలర్‌షిప్స్ విభాగం ఆధ్వర్యంలో విద్య లక్ష్మి పోర్టల్ ద్వారా అందించే విద్యా రుణాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారని వైస్ ఛాన్సిలర్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక స్టేట్ బ్యాంక్ఆఫ్ ఇండియా ఎస్‌బిఐ మేనేజర్ రుస్తుమ్‌ఖాన్ హాజర య్యాన్నారు. ఈ సందర్భంగా రుస్తుమ్ ఖాన్ మాట్లాడుతూ తక్కువ వడ్డీ రేట్లతో ప్రభుత్వం అందిస్తున్న విద్యా రుణాల ప్రయోజనాలను వివరించారు. విద్య లక్ష్మి పోర్టల్ ద్వారా రుణ దరఖాస్తు ప్రక్రియ పారదర్శకంగా, సులభంగా ఉండటంతో పాటు విద్యార్థులు తమ చదువును అంతరాయం లేకుండా కొనసాగించేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఆధార్, పాన్, మంచి సిబిల్ స్కోర్ ఆధారంగా ఒక్కో విద్యార్థికి రూ.7.5 లక్షల వరకు విద్యా రుణాలు పొందవచ్చని ఆయన వెల్లడించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థులకు విలువైన సమాచారం అందించినందుకు యూనివర్సిటీ యాజమాన్యం బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో స్కాలర్‌షిప్ విభా గాధిపతి డాక్టర్ ఆతహర్ సమీనా ఖాన్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బిఐ మేనేజర్ రుస్తుమ్‌ఖాన్

బెరైటీస్ మిల్లుల సమస్యకు పరిష్కారం



ఎంపిఎండిసి ఎండితో రూపానందరెడ్డి, మిల్లుల యజమానులు

ప్రజాశక్తి - రైల్వేకోడూరు

ఓబులవారిపల్లి మండలం మంగంపేట మైన్స్ ప్రాంతంలో గత కొన్ని నెలలుగా ముగ్గురాళ్ల మిల్లులకు అవసరమైన రాయి సరఫరా, ఎపి ఎండిసి యాజమాన్యం, మిల్లుల యాజమాన్యం మధ్య ఉన్న కొన్ని సమస్యల కారణంగా నిలిచిపోవడంతో 120కి పైగా మిల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల వల్ల స్థానిక పరిశ్రమలు, కార్మికులు, రోజువారీ ఉపాధిపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ పరిస్థితిని మంగంపేట ప్రాంత మిల్లు యజమానులు కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన రూపానందరెడ్డి విజయవాడలోని ఎపిఎండిసి ఎండితో చర్చిం చినట్లు తెలిపారు. మంగంపేట మైన్స్‌లో సరఫరా నిలిచి పోవడానికి కారణాలను తెలు సుకుని, సమ స్యలపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. మంగంపేట మైన్స్ నుంచి మిల్లు లకు రాయి సంఫరా పునరుద్ధరించేందుకు ఎపిఎండిసి అంగీకరించిందన్నారు.గత కొన్ని రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న 120 మిల్లుల సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. మిల్లులకు ముగ్గు రాయి సర ఫరా యథావిధిగా పునరుద్ధరించడంతో స్థానిక పారిశ్రామికవేత్తలు ముక్కాకు కృతజ్ఞతలు తెలిపారు. ఎపిఎండిసి యాజమాన్యంతో జరిగిన చర్చలలో స్థానిక పల్లవ రైజింగ్ మిల్లుల యజమానులు, పారిశ్రామిక వేత్త మాచినేని విశ్వే శ్వరనాయుడు, టివి రమణారెడ్డి, మంగంపేట ఉప సర్పంచ్ కవులూరి మధు సూదన్‌రెడ్డి, కల్లా చలపతి, జరుగు నారాయణరెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, సురేష్ పాల్కొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి, నిస్సార్ అహ్మద్

మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు దారుణం : వైసిపి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో అసలైన దోషి దాసరపల్లి జయచంద్రారెడ్డిని వదిలేసి మాజీ మంత్రి, బిసి నాయకులుజోగి రమేష్, జోగి రాములను అరెస్ట్ చేయడం రాజకీయ కుట్రలో భాగమేనని ఎమ్మెల్యే ద్వారకనాథ్ రెడ్డి, మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిసార్ అహమ్మద్ పేర్కొన్నారు. మంగళవారం తంబళ్లపల్లె కోర్టు వద్ద ఎమ్మెల్యే ద్వారకానాథ్ రెడ్డి, నిసార్ అహ్మద్ జోగి రమేష్‌ను కలవడానికి వెళ్ళారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములకల చెరువు నకిలీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టిడిపి నాయకులు జయచంద్రారెడ్డిని ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడంవెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. జయచంద్రారెడ్డి అసలు సూత్రధారి అంటూ సాక్షాత్తు టిడిపి వారే సోషల్ మీడి యాలో పోస్టులు పెట్టారని గుర్తు చేశారు. సిఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా మాట్లా డారనే అక్కసుతో జోగి రమేష్‌ను అక్రమ కేసులో ఇరికించి కోర్టుల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. జోగి రమేష్, జోగిరాము పైన కుట్రపూరితంగా కేసులు నమోదు చేశారని సిట్ దర్యాప్తు వద్దని సిబిఐతో దర్యాప్తు చేయించి నిజాన్ని నిగ్గు తేల్చటానికి కూటమి ప్రభుత్వం సిద్ధం కావాలన్నారు.కోర్టులు, దర్యాప్తు సంస్థలపై మాకు అపా ర నమ్మకం ఉందని సిబిఐ దర్యాప్తుతోనే అసలు దోషులు బయటకు వస్తారన్నారు.

యోగా అలవాటు చేసుకోవాలి

వేంపల్లె : ప్రాథమిక దశ నుండే విద్యార్థులు యోగా చేయడం అలవాటు చేసుకోవాలని ప్రోగ్రాం ఆఫీసర్ కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని మారుతి నగర్ ప్రాథమిక పాఠశాలలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు డ్రాయింగ్, ఆటలు పోటీలు నిర్వహించారు. బాలికలకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల హెడ్ మాస్టర్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొ న్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం :సిఐ

ప్రజాశక్తి-కలికిరి : సైబర్ నేరాలు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నూతనంగా బాధ్యతలు చేపట్టిన అప్ గ్రేడ్ సిఐ రామచంద్ర కోరారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మర్రికు ంటపల్లి పంచాయతీ గజ్జల వారిపల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందడంతో గ్రామీణ ప్రాంతంలో సైతం ప్రతి ఒక్కరూ సెల్ ఫోన్ వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. బ్యాంకు, ఎటిఎం, ఆధార్ వంటి వాటికి ఫోన్ నెంబర్లు అనుసంధానం చేయడం వలన సైబర్ నేరగాళ్లు ఇలాంటి సాంకేతికతను అందుపుచ్చుకొని కొత్త నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. అలాంటి సైబర్ నేరాలు పైన ప్రజలందరూ అవగాహన కలిగి ఉండి వారి బారి నుంచి తప్పించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు పైన కూడా జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు నిబంధనలను పాటించాలని, వాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రఫీ, విజయ్ కుమార్, గుర్రప్ప హెూంగార్డు నిజం సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ రామచంద్ర

క్రైం కార్నర్

పీలేరులో వ్యక్తి అదృశ్యం

- గాలింపులో పోలీసులు, కుటుంబ సభ్యులు
- వారం దాటినా లభించని ఆచూకీ

ప్రజాశక్తి-పీలేరు



భాస్కర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

పీలేరులో ఓవ్యక్తి వారం రోజుల క్రితం అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. అతని ఆచూకీ కోసం ఓవైపు పోలీసులు, మరోవైపు కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. పీలేరు పట్టణం, బోడు మల్లు వారిపల్లి పంచాయతీ పరిధిలోని స్థానిక తిరుపతి రోడ్డులో ఉన్న కృష్ణానగర్ లో నివాసం ఉంటున్న దేవులపల్లి భాస్కర్‌రెడ్డి(73) గత నెల 24న అదృశ్యమ య్యాడు. ఈ మేరకు భాస్కర్ రెడ్డి కుమారుడు శ్యామ్ రెడ్డి పీలేరు పోలీసులకు ఫిర్యాదు చేయగా నవంబర్ 28న పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి పీలేరు పోలీసులు అదృశ్యమైన డి. భాస్కర్ రెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. తిరుపతి, తిరుమల ప్రాం తాల్లో ఉంటున్న భాస్కర్‌రెడ్డి బంధువులను పోలీసులు తమదైన శైలిలో విచా రించారు. తిరుపతి నగరం డి.ఆర్ మహల్ వెనుక ఎస్‌టివి నగర్‌లో ఉన్న భాస్కర్ రెడ్డి నాలుగవసోదరుడు ప్రాపర్టీ వాల్యువేటర్ డి.శ్రీనివాసులు రెడ్డి ఇంటి వద్ద నవంబర్ 24న రాత్రి 8:15 నుండి 8:30 మధ్యలో ఆటో దిగినట్లు, నవంబర్ 30న ఉదయం 11 గంటలకు సిసి పుటేజి దృశ్యాలు ఆధారంగా తన తండ్రిని హెడ్ కానిస్టేబుల్ మణి సమక్షంలో గుర్తించినట్లు కుమారుడు శ్యామ్‌రెడ్డి తెలి పారు. అనంతరం తన తండ్రి ఆచూకీ కోసం మరింత గాలింపు ముమ్మరం చేయాలని, అనారోగ్యం కారణంగా రోజువారీ మందు బిళ్ళలు వాడుతున్న తన తండ్రి 8రోజులుగా ఎలా వున్నారో, ఆయన ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందోనన్న ఆందోళనలో కుటుంబ సభ్యులు ఉన్నారు. పోలీసులు మరింత చొరవ చూపి వీలైనంత త్వరగా తమ తండ్రి ఆచూకీని గుర్తించాలని పోలీసులకు విజ్ఞప్తి చేసుకుంటున్నారు.

ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం సాయంత్రం రెడ్డివారిపల్లి గ్రామంలోని పెట్లావాండ్లపల్లెలో కొందరు పేక ముక్కలతో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3750లు నగదును, మూడు మొబైల్ ఫోన్లను, పేక ముక్కలను స్వాధీనం చేసుకొని, కసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పక్కింటివారితో గొడవపడిన మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు..పట్టణంలోని గౌతమీనగర్‌కు చెందిన నరసింహులు భార్య ఈశ్వరమ్మ స్థానికంగా ఉన్న గోపాల్ అనే వ్యక్తితో సన్ని హితంగా ఉంటోంది. గోపాల్ కుటుంబ సభ్యులు రమణ, మరి కొంతమంది ఈశ్వరమ్మతో గొడవ పెట్టుకుని ఆమెపై దాడికి యత్నించారు. గోపాల్ తనవైపు మాట్లాడలేదన్న బాధతో ఈశ్వరమ్మ తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

నమ్మి మోసపోయాను

ప్రాణహాని ఉంది రక్షణ కల్పించండి

-పోలీసులను ఆశ్రయించిన యువతి

ప్రజాశక్తి-పీలేరు

తనను నమ్మించి, పెళ్లి చేసుకుని, మోసం చేశాడని అతని నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించి కాపాడాలంటూ ఓ యువతి పోలీసులను ఆశ్రయించిన సంఘటన కెవిపల్లి మండలంలో చోటు చేసుకుంది. మంగళవారం బాధిత యువతి మీడియాకు తెలిపిన కథనం మేరకు.. కెవి పల్లి మండలం, మారెళ్ళ గ్రామం, నల్లకమ్మిరెడ్డిగారిపల్లికి చెందిన ఉప్పుతోళ్ల బలరాం, శ్రీదేవి దంపతుల కుమార్తె శ్రావణి అదే గ్రామానికి చెందిన జయ చంద్రారెడ్డి కుమారుడు నందకుమార్ రెడ్డి ఇరువురూ ప్రేమించుకుని రహస్యంగా పెళ్లి చేసుకున్నారు. ఆ యువకుడు చెప్పిన మాయమాటలు నమ్మి, ప్రేమించి పెళ్లి చేసుకున్నానన్నారు. వారం రోజుల తర్వాత అతనికి మరో పెళ్లి కూడా జరిగిందని, తనతోపాటు మరో యువతిని కూడా అతను మోసం చేశాడని తెలిపింది. రెండు పెళ్లిళ్లు చేసుకున్నట్టు తనకు ఎందుకు చెప్పలేదంటూ ప్రశ్నించడంతో ప్రతిరోజూ మద్యం సేవించి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని చెప్పారు. చంపేస్తానని బెదిరిస్తున్నాడని, అతని నుంచి తనకు ప్రాణహాని ఉందని, తనను కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ చేపడతామని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ నిందితులకు జరిమానా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో పట్టుబడ్డ ఐదు కేసులలోని నిందితులపై గతంలో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం ఈ కేసులు కోర్టులో విచారణకు రాగా కోర్టులోని జడ్జి సమగ్రంగా విచారించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ వారికి ఒక్కొక్కరికి రూ.11వేలు జరిమానా విధించడం జరిగిందన్నారు. మద్యం సేవించి రోడ్డుపై వాహనాలు నడపడం ప్రజల ప్రాణాలకు తీవ్ర ప్రమాదమన్నారు. ఇటువంటి ప్రమాదకరమైన ప్రవర్తనకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వారి డ్రైవింగ్ లైసెన్స్ ను రద్దు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హెల్మెట్ ధరించాలని, వేగంగా వాహనాలను నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు తప్పని సరిగా పాటించాలని, సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని హెచ్చరించారు.

అన్నమయ్య కాలిబాటకు అనుమతి లేదు : డిఎఫ్ఒ



మాట్లాడుతున్న డిఎఫ్ఒ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు :మండల పరిధిలోని కుక్కల దొడ్డి గ్రామం నుంచి అటవీ ప్రాంతం అన్నమయ్య కాలి మార్గం ద్వారా తిరుమల వైపు వెళ్లే భక్తులకు అనుమతిని లేదని డిఎఫ్ఒ ఆర్.జగన్నాథ్‌సింగ్ తెలిపారు. అటవీ మార్గం గుండా అటవీ జంతువులు ఎక్కువగా సంచరిస్తున్నాయని తెలిపారు. చిన్న పిల్లలతో కూడిన ఏనుగుల గుంపులు అధికంగా ఉందని, వాటి వల్ల ప్రజలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. గతంలో ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజాశ్రేయస్సుకోసం అటవీశాఖ ఈ మార్గం ద్వారా తిరుమల వెళ్ళు భక్తులకు అనుమతిని నిరాకరించినట్లు తెలిపారు. తిరు మల వెళ్ళు భక్తులు అటవీ శాఖకు సహకరించి, రోడ్డు వెంబడి తిరుమలకు వెళ్లవలసిందిగా ఆయన కోరారు.

ఎయిడ్స్ వ్యాధి నివారణపై ర్యాలీ

ప్రజాశక్తి - వేంపల్లె :ప్రజలను చైతన్యం కల్పించేందుకు మంగళవారం ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ ప్రభుత్వ డిగ్రీ ఆవరణలో రెడ్ రిబ్బన్ క్లబ్ అండ్ యూత్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోస్టర్, పెయింటింగ్ ప్రజెంటేషన్, రంగోలి పోటీలు చేపట్టారు. వేంపల్లె ప్రధాన రహదారి గుండా నాలుగు రోడ్ల వరకు ర్యాలీ నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుధాకర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.